# చెడావుల ముచ్చట

సాధారణంగా ఒక్కొక్కరికి ఒక్కొక్క సరదా వుండటం కద్దు. సరదాలు, ముచ్చటలు అనేవి వారివారి రుచుల కనుగుణంగా వుంటూ వుంటాయి. వారివారి స్వభావాలను బట్టి, రుచులను బట్టి మారుతూవుంటాయికూడా. నాకు చాలా రోజులనుంచీ, హిందూస్థానీ స్త్రీలు ధరించే పాద రక్షలలాంటివి వేసుకోవాల నిచాలమనసుగా వుండేది. వాటినేచెడావులంటారు. నాకు అలాంటి సరదా ఎట్లాకలిగిందంటే, నేను చెడావులను ఒక హిందూస్థానీ స్నేహితులయింట్లో చూచాను వెంటనే నేను ఆ స్నేహితురాలిని చెడావు లెక్కడ కొన్నారని అడిగాను. దానికి ఆమె యిటువంటివి యిక్కడ దొరకవని, ఉత్తర హిందూదేశంలో (ఢిల్లీ, కలకత్తా)నే దొరుకుతా యని చెప్పింది. దానితో నేను కొంచెం నిరుత్సాహపడ్డ మాట నిజమే. నేను ఆ చెడావులనే ముహూర్తాన చూశానో కాని అవి నన్ను చాలా ఆకర్షించాయి. చక్కని జరీపనితో, ఆకర్షణీయమైన రంగుతో, మంచి ముఖమల్ లెదరుతో ముద్దులొలుకుతూయున్నాయి.

నేనంతటితో వొదిలి పెట్టలేదు. ఆమెను, చెడావులు తమ దేశం నుంచి తెప్పించగల దేమోనని అడిగాను. కాని వాళ్ళు వాళ్ళేవరూ అప్పట్లో ఢిల్లీ వెళ్లరని చెప్పింది. నేను యింటికి వచ్చానన్న మాటేగాని, నా మనస్సంతా చెడావుల మీదనే వుంది. ఇక్కడ ఇంత అందమైన బర్మా శాండల్స్, బాటా జోళ్ళు, హైహీల్సు అన్నీ వుంటే ఎక్కడో అందని పండ్లకోసం చూస్తుందేమిటా అని మీరు ఆశ్చర్య పడవచ్చు కాని చెడావులాకర్షించినట్లు నన్ను మరే యితర ఆకర్షించలేదు. ఎప్పటికయినా వారిని కొనుక్కొని తీరాలని పట్టుదల కలిగింది.

ఇట్లావుండగా ఆ మధ్య మా నాన్నాగారు ఏదో పని మీద ఢిల్లీ వెళ్ళవలసివచ్చింది. ఇంక చూసుకోండి నా సంతోషం నిజంగా చెడావులను కొనుక్కున్నంత సంబరమైంది. ఇంత కాలానికి చెడావులను కొనుక్కొనే యోగం పట్టింది కదా అని మురిసిపోతూ, నా కోరికను మా నాన్నగారితో చెప్పాను. అసలు మా నాన్న చాలా మంచి వారు. నే నేదడిగినా మారు చెప్పేవారు కారు. కొండమీద కోతి నన్నా సరే తెచ్చియిచ్చేవారు. ఆయున చెడావులే కదటమ్మా తెస్తానన్నారు. కాని మా అమ్మ అడ్డొచ్చి ఏమిటే పులిని చూసి నక్కవాత పెట్టుకుందన్నట్లు ఆ చెడావులు హిందీ వాళ్ళకే సరిపడ్డాయి కాని, వాట్లతో నువ్వెలా నడవగలవే, డబ్బు దండుగ కాని అని ఓ అడ్డుపుల్ల వేసింది. దానితో నాకు చెప్పలేనంత కోపము, దుఃఖము వచ్చింది. అది చూసి మా నాన్న అమ్మతో పోనియ్యావే యింతలో మునిగి

శ్రీమతి మొసలికంటి శాంతగారు

పోయిందేమిటి, అది సరదా పడుతూంటే అన్నారు. దానికి నేనెంత సంతోషించానను కున్నారు? మనస్సులో మా నాన్నగారిని ఎంతో పొగడుకున్నాను.

సరే! నాన్నగారి ప్రయాణపు రోజువచ్చింది. ఆ క్రితం రోజే నా కాలి ఆది జాగ్రత్తగా పేపరు మీద వేసివుంచాను. నాన్నగారు చెప్పిన ప్రతి పనీ ఎందో శ్రద్ధగా చేసాను. నాన్నగారిని రైలెక్కించేందుకు, స్టేషనుకు వెళ్ళాము. రైలెక్కాక మరొక సారి, చెడావుల మాట మర్చిపోవద్దని నాన్నగారిని హెచ్చరించాను. తరువాత స్కూల్లో స్నేతులందరితోనూ, నాన్నగారు ఢిల్లీనుంచి చెడావులు తెస్తారని చాటేశాను. నాన్న వారం రోజులదాకా రారు. అబ్బా! వారం రోజులెలా గడపటం అని బాధపడ్డాను. ఎప్పుడు చెడావులు తెస్తారా, ఎప్పుడు తొడుక్కుందాం అని వేచివున్నాను. నాన్నగారు వచ్చినట్లు, అందమైన చెడావులు తెచినట్లు రోజూ కలలే. అందులోనూ తెల్లవారగట్ల వచ్చే కలలు నిజమవుతాయని నాకు చాలా నమ్మకం. అంతకు ముందు కలలంటే ఏమిటో ఎరుగని నాకు, ఈ చెడావుల సందట్లో రోజూ కలలే.

మరి వారం రోజులు గడిచాక నాన్నగారు వచ్చారు. చెడావులుకూడా తెచ్చారని వేరే చెప్పక్కర్లేదు. అవి చూసుకుని నేనెంతో మురిసిపోయాను. మంచి ముఖమల్ గుడ్డతో తోపురంగుతో, జరీతో చాలా అందంగా వున్నాయి. ఇంటికి వచ్చిన వాళ్ళందరికీ చూపించాను మా తమ్ముడు అవి చూసి చాలా ఉడికిపోయాడు. ఎలాగయితేనేం. నా ముచ్చట తీరింది.

అయితే కొనగానే సరా! వాట్లతో నడవటం అలవాటవద్దూ? కాలికి తొడిగి చూస్తే ఆకు జోళ్ళ (స్లిప్పర్స్)లా లేవు. కొంచెం బిగువుగాను అసౌకర్యంగానూవున్నాయి. నేనంతతో నిరుత్సాహపడలేదు. ఇంట్లో తొడుక్కు నడుస్తే అలవాటవుతుంది గదా అని, చెడావులు తొడుక్కుని యిల్లంతా, దొడ్లోనూ తిరగడం మొదలెట్టాను. అది చూసి మా అమ్మ,-కోతికి కొబ్బరికాయ దొరికినట్లు, ఆదేమిటే అని సాధించడం ప్రారంభించింది. చెడావులతో నడవటం సరదాగానే వుంది కాని, అలవాటులేక అడుగు ముందుకి పడదు. ఇంక మా తమ్ముడు, బాగా అయిందిలే శాస్తి అని వెక్కిరించడం మొదలెట్టాడు. దాంతో నాకు ఉక్కురోషంవచ్చింది. కాని పైకి కనపడకండా ఎట్లాగో అణుచుకున్నాను. ఎవన్నా అంటే నాకేగా నెత్తికి చేతులు వచ్చేది. మరి? నాన్నగారది చూసి, రెండురోజులు పోతే అలవాటవుతుందమ్మా అని ఓదార్చారు.

తరువాత రెండు రోజులు కాదు, నాలుగు రోజులు గడిచాయి. అయినా అలవాటవలేదు. అవి వేసుకుంటే కాలికి బాధకలిగేది. అయినా, వాటి అందం చూసుకుని మురిసి పోయేదాన్ని తరువాత నా స్నేహితురాండ్రొకళ్ళిద్దరు చెడావులు తెస్తారన్నావు ఏదో ఆన్నావు ఏవి? అన్నీ

గొప్పలే అని చెప్పడం మొదలెట్టారు. ఇంక వేరే గత్యంతరం లేక ఒక రోజు అవి చూప డానికి నిశ్చయించాను. వెళితే తొడుక్కునే వెళ్ళాలి. పేపర్లో కట్టి తీసుకెడితే నవ్వుతారని భయం. వాట్లతో నడవడం గండంగావుంది. సరే యేమైతే అవుతుందని తొడుక్కుని వెళ్ళ డానికే నిశ్చయించాను. ఆ రోజు అమ్మ వద్దం టూన్నా వినకండా చెడావులు తొడుక్కుని స్కూలుకి బయలుదేరాను. మా యింటినుంచి బస్సుస్టాండు దాకా 1½ ఫర్లాంగుల దూరం వుంటుంది. తరువాత బస్సుదిగి మరోకొంచెం దూరం నడవాలి. రిక్షాలరుదుగా వుంటాయి. చెడావులతో గేట్లోంచి రోడ్డు మీదకే అడుగు పడదు. ఇంత దూరం ఎలా నడవనురా బాబూ అని భయమేసింది. కాని మరి తప్పదుగా! నడ వడం మొదలెట్టాను. బొటన వ్రేళ్ళు రెండూ మెలికపడ్డాయి. కాలంతా అందులో యిరుక్కుని బాధగావుంది. అడుగు పడటంలేదు. అయినా మొండికెత్తి బరువుగా అడుగులేస్తూ నడిచాను. సగం ధూరం నడిచేటప్పటికి ఆయాసం మొద లెట్టింది. ఐనా, పట్టుదలవలన ఎట్లానో కష్టపడి స్కూలుకి జేరాను. నా చెడావులు నా స్నేహితు లందరూ చూచి చాలా బాగున్నాయన్నారు. దానితో నా ముఖం విప్పారింది. బాధంతా మర్చిపోయాను.

కాని అప్పుడే అయిందీ? మరి ఓచ్చే టప్పుడో అదేమి శాపమో కాని ఒక్కా రిక్షా యైనా కనపడలేదు. నా కాళ్ళబాధ ఎక్కువైంది. అలాగే కుంటుకుంటూ బస్సుమీద ఆళ్వార్ పేట జేరాను. ఇంక అక్కడ నించి ఇంటికి జేరే టప్పటికి తలప్రాణం తోకకొచ్చింది. నిజంగా ఏడుపొచ్చింది. జోళ్ళు విప్పేసి చేత్తోపట్టుకు నడుస్తే ఎవరైనా చూసి నవ్వు తారని భయం. ఎట్లాగో యింటికి జేరాను. పాదాలు వాచి ఎఱ్ఱగా అయిపోయాయి. నడుస్తే విపరీతమైన నొప్పి బొటనవ్రేళ్లు పుండు అయిపోయాయి. నా స్థితి చూసి మా అమ్మ తిట్టడం మొదలెట్టింది. బంధువులంతా నవ్వడం ఆరంభించారు. రెండు రోజులు కాలు కిందపెట్టలేక పోయాను. అమ్మ మాట వినకండా ఎందుకు తొడుక్కున్నానురా భగవంతుడా అని పశ్చాత్తాపపడ్డాను. నా చెడాల ముచ్చట అలా తీరింది. ఇప్పటికి అవి పెట్టెలోనే వున్నాయి. కొత్తగా, అందంగా, ముద్దొస్తూను. ఉపయోగిస్తేగా మరి?

